ప్రజాశక్తి
మంగళవారం 28 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి



ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరుగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల కోసం పట్టణంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఇంటర్ విద్య కడప ఆర్‌జెడి రవి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి ఎ, బి, కేంద్రాలతోపాటు సప్తగిరి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ఇంటర్ బోర్డు సూచించిన సూచనలను తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కేంద్రాల్లో గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్, నీటిసౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా సమయానికి అనుగుణంగా కేంద్రాలకు చేరుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో జిల్లా ఇంటర్ డిఐఇఒ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం సిటిఒ కార్యాలయం

పురం సిటిఒ కార్యాలయంలో


ఎసిబి దాడులు

◆రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు

◆అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంపై సోమవారం సాయంత్రం ఎసిబి అధికారులు దాడి చేశారు. ఓ ఎగ్జిబిషన్ నిర్వాహకుని నుంచి లంచం తీసుకుంటూ ఉండగా అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములతో పాటు సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, అటెండర్ జ్యోతిరావు, క్లర్క్ శేఖర్‌లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ పరిగి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వి.నాగేష్ బిందు ట్రేడ్ ఎగ్జిబిషన్ నడుపుతున్నాడు. హిందూపురం పట్టణంలోని నానేప్పనగర్‌లో గోడౌన్ ఏర్పాటు చేసుకుని అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పలు పట్టణాల్లో ఎగ్జిబిషన్ నడుతున్నాడు. ఇతను జిఎస్‌టి నెంబరు సైతం తీసుకుని టర్నోవర్ జరిగిన రూ.2లక్షలకు రూ.36వేలు పన్ను సైతం ఇటీవల చెల్లించాడు. కాగ రాజశేఖర్ టర్నోవర్ ఎక్కువ జరిగిందని దాడులు నిర్వహించి, జరిమానాలు విధిస్తే ఎక్కువ మొత్తంలో విధించాల్సి ఉంటుందని సిటిఒ అధికారులు అతన్ని బెదిరించారు. ఇలా జరక్కుండా ఉండాలంటే రూ.50వేలు లంచాన్ని డిమాండ్ చేశారు. ఇంత తాను ఇవ్వలేనని రూ.30 వేలు ఇవ్వడానికి బేరం కుదుర్చుకున్నాడు. ఇదే విషయాన్ని బాధితుడు నగేష్ ఎసిబి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎసిబి అధికారుల సూచన మేరకు నాగేష్ సోమవారం సాయంత్రం రూ.30 వల నగదును తీసుకుని సిటిఒ కార్యాలయానికి వెళ్లాడు. నగదును సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు ఇచ్చాడు. వెంటనే రాజశేఖర్ దీనిని క్లర్క్ శేఖర్‌కు రూ.25వేలు, అటెండర్ జ్యోతిరావుకు రూ.5 వేలు ఇచ్చాడు. అప్పటికే అక్కడ కాపుకాచిన ఎసిబి అధికారులు దాడులు చేసి లంచం తీసుకున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ అవినీతి బాగోతంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములు ఉన్నాడని తేలడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించామని ఎసిబి డీఎస్పీ తెలిపారు.



బరిలో నిలిచే వారి,,, లెక్క తేలింది,,!

బరిలో అభ్యర్థులు
పట్టభద్రులు : 49
ఉపాధ్యాయ స్థానం : 12

ఉపసంహరణలు
పట్టభద్రులు : 02
ఉపాధ్యాయ స్థానం : 02

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికల పోరులో మలిఘట్టం పూర్తయ్యింది. ఉపసంహరణలు పూర్తవడంతో బరిలో నిలిచేదెవరన్నది స్పష్టమైంది. పట్టభద్రుల నియోజకవర్గానికి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో నిలువనున్నారు. నామినేషన్ల దాఖలు స్క్రూటనీ తరువాత 51 మంది అభ్యర్థులు పట్టభద్రుల నియోజకవర్గానికి, 14 మంది ఉపాధ్యాయ నియోజకవర్గానికి అభ్యర్థులు పోటీలో ఉండేవారు. ఉపసంహరణల సమయంలో వీరిలో పట్టభద్రులకు ఇద్దరు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఇద్దరు నామినేషన్ పత్రలను సోమవారం నాడు ఉపసంహరించుకున్నారు. దీంతో పట్టభద్రుల నియోజకవర్గానికి 49 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో నిలిచారు. టిడిపి అభ్యర్థి బి.రామగోపాల్‌రెడ్డి భార్య భూమిరెడ్డి ఉమాదేవి, వెన్నపూస వెంకట మహేశ్వరరెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఉపసంహరించుకున్న వారిలోనున్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వస్తే స్వతంత్ర అభ్యర్థులు చింతకుంట రమేష్, ఎంవి.శ్రీదేవిలు ఉపసంహరించుకున్నారు.

నేటి నుంచి ప్రచార హోరు మొదలు

మండలి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తేలిపోవడంతో ఇక నుంచి ప్రచారహోరు కొనసాగనుంది. ఇప్పటికే ఆయా అభ్యర్థులు ఓటర్లను కలుసుకునే పనిని చేపట్టారు. పశ్చిమ రాయలసీమ స్థానంలో పాత జిల్లాలు మూడయితే కొత్తవి ఆరు జిల్లాలు ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లోనూ అభ్యర్థులు ప్రచారాలు కొనసాగించనున్నారు. ఇప్పటికే అధికార వైసిపి అభ్యర్థులకు మద్దతుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతపురం నగరం విచ్చేశారు. జిల్లాలోని ముఖ్య నేలతందరితోనూ ప్రత్యేకంగ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థుల విజయానికి కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిల విజయానికి ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులతోపాటు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులు అభ్యర్థుల తరుపున ప్రచారం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మార్చి 11వ తేది సాయంత్రం నాలుగు గంటల వరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు అవకాశముంది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మంగమ్మ ఏకగ్రీవం



ఎస్.మంగమ్మ



ఎమ్మెల్సీ డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న ఎస్.మంగమ్మ

స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు జరిగిన నామినేషన్లలో ఒక్క నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. ఈ స్థానానికి జరిగిన నామినేషన్ ప్రక్రియలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో వేలూరి రంగయ్యకు సంబంధించిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధికార వైసిపికి చెందిన మంగమ్మ ఒక్క నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. ఉపసంహరణలు కూడా పూర్తయిన నేపథ్యంలో స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు సంబంధించి మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆమెకు డిక్లరేషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉషచరణ్ శ్రీ, మాజీ మంత్రి ఎం.శంకర నారాయణ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాం

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్

పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యిందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్సు హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 13న జరిగే ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్టు తెలిపారు. పిఒలు, ఎపిఒలు, ఇతర పోలింగు సిబ్బంది అందరికీ రెండు విడతల్లో ఎన్నికల నిర్వహణపైన శిక్షణ ఇస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో అభ్యర్థులు ప్రచారాలు చేసుకోవచ్చునని తెలిపారు. పేర్ల వివరాల వారీగా బ్యాలెట్ పేపరును ఎన్నికల సంఘం రూపొందించి పంపుతుందన్నారు. ఓట్లకు కూడా ఈ ఎన్నికల్లో ఓటింగ్ ఎలా చేయాలన్న దానిపైనా మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. వారికి అవసరమైన సహకారాన్ని , సూచనలను అందించేందుకు జిల్లా కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థుల వ్యయంపైనా పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నట్టు వివరించారు.

గృహ లక్ష్యాలను చేరుకోవాలి

కలెక్టర్ పి.బసంత్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణ లక్ష్యాలను అనుకున్న సమయంలోపు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు కషి చేయాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హౌసింగ్, నాడు-నేడు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, సచివాలయాల్లో అందిస్తున్న సేవలు, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, డిఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ పరిధిలో ఉగాది నాటికి సామూహిక గహ ప్రవేశాలు కింద జిల్లాలో 10,600 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 2,336 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి అర్బన్, హిందూపురం, హిందూపురం అర్బన్, బుక్కపట్నం తదితర ప్రాంతాల్లో పురోగతి తక్కువగా ఉందని, ఇక్కడ వెంటనే పనుల వేగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్ తదితర భవన నిర్మాణ పనులనూ వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయాల సేవలకు సంబంధించి జిల్లాలో 33 సచివాలయాల్లో ఆధార్ అప్డేట్ చేయడం లేదని, కొన్ని సచివాలయాల్లో ఒక్కటీ చేయడం లేదన్నారు. అన్ని సచివాలయాల్లో ఆధార్ అప్డేట్ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ప్రతి రోజు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-కనగానపల్లి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని సిఐటియు, కౌలు రైతుసంఘం, ప్రజాసంఘాల నాయకులు సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్ప ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బత్తల కదిరప్ప మాట్లాడుతూ శాసన మండలిలో ప్రజలు తరపున ప్రశ్నించే గొంతుకులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బత్తలపల్లిలో స్థానిక వైసిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. సోమవారం చిత్తూరు జిల్లా నుంచి అనంతపురంలో జరుగుతున్న వైసిపి అనుబంధ శాఖల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్ల సమీక్ష సమావేశానికి వెళ్తుండగా విషయం తెలుసుకున్న ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంత్రికి దుశ్శాలువాలు కప్పి పూలమాలలు, పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనంతపురం వెళ్లిపోయారు. మధ్యాహ్నం చిత్తూరు జిల్లాకు వెళ్తూ బత్తలపల్లిలోని ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు స్వగృహానికి మంత్రితోపాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు విందు ఆరగించారు. గృహ ప్రవేశ సమయంలో సమయం కుదరక రాలేకపోయానని, ఇప్పుడు తేనీటి విందుకు హాజరైనట్లు పార్టీవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోటి సుధ వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, వైస్ ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు,జెడ్పీటీసీ కోటి సుధ

సజావుగా ఎన్నికలు నిర్వహిద్దాం

◆ పకడ్బందీగా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలి

◆ ఎలక్షన్ కమిషన్ నిబంధనల అమలు తప్పనిసరి

◆ సమీక్ష సమావేశంలో ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు డా॥పోలా భాస్కర్, ఎం.హరి జవహర్ లాల్‌లు సూచించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో అధికారులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనల మేరకే పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో చేపట్టే పనులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ నిర్వహించే పీవోలు ,ఏపీవోలు, ఎన్నికల సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన సమస్యలు ఉంటాయని, వాటిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా అంతటా శాంతి భద్రతలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. నిర్దేశిత సమయంలో ఎన్నికల సామగ్రిని ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు సంబంధించి అభ్యర్థుల పేర్లలో అక్షర దోషాలు లేకుండా ప్రింట్ చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ చాలా సున్నితమైన అంశమని, అందులో అభ్యర్థుల పేర్లు, సంబంధించిన ఫొటోలు ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నెట్ సమస్య లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎన్నికల పరిశీలకులకు తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల నియోజక వర్గాలకు 84 పోలింగ్ స్టేషన్లు, టీచర్ల నియోజకవర్గాలకు 33 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 579 మంది పోలింగ్ సిబ్బందిని కూడా నియమించామని, వారికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. ఎస్పీ కె.ఫక్కీరప్ప మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలకు శాంతి భద్రతల దష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 33 రూట్లలో మొబైల్ పార్టీలను, 54 లొకేషన్స్‌లలో ఫ్లయింగ్ టీమ్లను ఏర్పాటు చేశామన్నారు. 27 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, 20 పికెట్స్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, అనంతపురం, కళ్యాణదుర్గం గుంతకల్ ఆర్డీవోలు మధుసూదన్, ఏ.నిశాంత్‌రెడ్డి, రవీంద్రతో పాటు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు, మల్బరీ తోట దగ్ధం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి



అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు

మండలంలోని మేడాపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తుంపిరి పెద్దన్నకు చెందిన మామిడి చెట్లు, మల్బరీ తోట పూర్తిగా కాలిపోయినట్లు బాధిత వాపోయాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మేడాపురం గ్రామానికి చెందిన తుంపిరి పెద్దన్న, సుజాత వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారు. అయితే ఇటీవల జీవనోపాధి కోసం కర్నూలు జిల్లా శ్రీశైలానికి వలస వెళ్లారు. ఈ క్రమంలో ఆకతాయిలు మామిడి తోటకు సమీపంలో ఉన్న బీడు ప్రాంతంలోని ఎండుగడ్డికి నిప్పు పెట్టారు. దీంతో ఎండుగడ్డి కాలుతూ మామిడి తోటకు మంటలు పాకడంతో మామిడి తోటతోపాటు సమీపంలో ఉన్న మల్బరీ తోట పూర్తిగా కాలిపోయింది. పంటలతోపాటు బోరు పైపులు, డ్రిప్పు పైపులు, పరికరాలు కూడా దగ్ధమైనట్లు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. చుట్టు పక్కల రైతుల నుంచి వివరాలను సేకరించారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపిపి గుర్రం వనజ రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి-బత్తలపల్లి

వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసిన బత్తలపల్లి ఎంపిపి గుర్రం వనజ రాజీనామా పత్రాన్ని జడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డి ఆమోదించారు. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈనెల 14న స్వయంగా జెడ్పీ సీఇఒకు రాజీనామా పత్రాన్ని అందజేసిన విషయం తెలిసిందే. దీంతో జడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డి ఈనెల 25న రాజీనామాను ఆమోదించారు. నూతన అధ్యక్షులు ఎన్నిక అయ్యేవరకు ప్రత్యామ్నాయంగా వైస్ ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి అధ్యక్షులుగా కొనసాగనున్నారు. దీంతో వెంగళరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

స్థానిక వ్యాపారులను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఇతర రాష్ట్రాల వ్యాపారుల నుంచి స్థానిక వ్యాపారులను కావాలని బత్తలపల్లి ఎస్ఐ టీవీ శ్రీహర్షకు పలువురు స్థానిక వ్యాపారులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 20 ఏళ్లుగా సిమెంట్, ఐరన్, ఎలక్ట్రికల్ తదితర సామగ్రికి అమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. దీంతోపాటు పలువురికి ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. అయితే గతేడాది టైల్స్ అమ్ముకుంటామంటూ వచ్చిన ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి తమ వ్యాపారాలను దెబ్బతీయడం మొదలు పెట్టారన్నారు. ఈనేపథ్యంలో వారం రోజుల క్రితం వ్యాపారులందరం కలిసి మీరు తొలుత టైల్స్ అమ్ముకుంటామని చెప్పి ఇప్పుడు ఇతర సామగ్రిని అమ్ముతుండటం వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని కేవలం టైల్స్ మాత్రమే అమ్మాలని కోరామన్నారు. అయితే ఇందుకు సమ్మతిందని ఆ వ్యక్తి తాను అమ్మేదే అని ఎవ్వరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ హద్దు మీరి ప్రవర్తించడంతో తామే చేయి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి రాజకీయం జోడించడం తగదన్నారు. స్థానికులు కొందరు వైసిపి నాయకులు దాడి చేశారని వ్యక్తీకరించడం బాధాకరమన్నారు. ఎప్పుడూ తమ మధ్య రాజకీయాలు చోటు చేసుకోలేదన్నారు. తాము లోకల్ వ్యాపారులమని వారు నాన్ లోకల్ అని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఇందుకు రాజకీయ పార్టీల నేతలు, ప్రజలకు కూడా తమకు సహకరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యాపారులు ప్రవీణ్, మాల్యవంతం బాలిరెడ్డి, నిడిగల్లు శ్రీనివాసులు, సతీష్, ఇర్ఫాన్, కోటి సురేష్, వక్కల శ్రీనివాసులు, ఆవుల రమణారెడ్డి, వరిమడుగు రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు వ్యాపారులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బత్తలపల్లి : ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని హజరత్ హిమామ్ భాషీ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. భాషీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా భాషీంస్వామి చిన్న గంధం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం బత్తలపల్లిలోని భాషీస్వామి పీర్ల చావిడి వద్ద ఆర్డీటీ బ్లడ్ బ్యాంకు బృందం కిశోర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి ట్రస్ట్ తరపున వారికి బాండ్లను అందజేశారు. అనంతరం అంబులెన్స్ సర్వీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జక్కంపూటి సత్యనారాయణ, వెంకటేశ్వరచౌదరి, ట్రస్ట్ ఛైర్మన్ ముక్తుమ్ భాషీం, ట్రస్ట్ సభ్యులు, ఆర్డీటీ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీలో రీజినల్ లెవల్ క్విజ్‌పోటీలు

బత్తలపల్లి : ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం రీజనల్ స్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించినట్లు ఆర్‌డీ ప్రమీల, ఎటిఎల్ ల్యాంగద తెలిపారు. ఈ క్విజ్ పోటీల్లో రీజియన్ పరిధిలోని 10మండలాలకు చెందిన 10 టీముల నుంచి 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కొత్తచెరువు ఏరియా నుంచి 132 మార్కులతో ప్రథమస్థానం, 111 మార్కులతో ముదిగుబ్బ టీం ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఆర్డీటీ బహుమతులు అందజేశారు. వీరు మార్చి 11న అనంతపురంలో జరిగే సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నుంచి రామకృష్ణ, ఎడ్యుకేషన్ ఎస్‌టిఎల్ పూజిత, రెడ్డెప్ప, నాగభూషణ, సంఘం ఉపాధ్యాయులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ

గాండ్లపెంట : వేసవిలో పశువులకు గడ్డి కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో బోరు బావుల కింద గడ్డి సాగు చేసుకోవడానికి విత్తనాలు పంపిణీ చేస్తామని సోమవారం పశు వైద్యాధికారి చెన్నకేశవులు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండలంలో పాడి పశువులకు చెందిన 75 శాతం మంది రైతులకు సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. గడ్డి విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక పశువుల ఆసుపత్రిలో సంప్రదించాలని ఆయన కోరారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట: మండల పరిధిలోని గాజులవారిపల్లి పెద్ద తండా పంచాయతీలో సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచి శాంతమ్మ సోమవారం ప్రారంభించారు. దాదాపు రూ. 6 లక్షల సచివాలయ నిధులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే నాడు నేడు కింద పాఠశాల అభివృద్ధి కోసం 11 లక్షల రూపాయలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బి లక్ష్మీదేవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాస నాయక్, సుధాకర్ నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామంలో 1,2 అంగన్వాడీ కేంద్రాలను ఎంపిపి ప్రమీల మూర్తి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అందజేస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. సెంటర్లో పాలు, కంది బ్యాళ్లు ఇవ్వలేదని తెలియడంతో సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెనుకొండ : కొత్తగా చేపడుతున్న విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్ కోరారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిఓ నెంబర్ 18 గురించి చర్చించారు. రోడ్ల బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల నిర్మాణం నిషేధించబడినవన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరైనా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ డివిజన్ ఎఇ జె. సంజీవయ్య పెనుకొండ, హిందూపురం, మడకశిర మండలాల మునిసిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హిరేతుర్పిలో ఉట్లమాను ఉత్సవం

గుడిబండ : మండల పరిధిలోని హిరేతుర్పి గ్రామంలో మూడు రోజులుగా జరిగిన ఆంజనేయస్వామి రథోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆఖరిరోజుగా ఉట్ల మాను ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువకులే కొసపురం వంశానికి చెందిన ఎర్రన్న ఉట్ల మానుపై ఉన్న టెంకాయను తీసుకువచ్చి బహుమతులను అందుకున్నారు. జాతర సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

చిలమత్తూరు : మండల పరిధిలోని టేకులోడు బాలికల గురుకుల పాఠశాలను సత్యసాయిజిల్లా కన్వీనర్ ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థినిలకు నైట్ వాష్‌రూమ్స్ లైటింగ్ లేదన్న ఆరోపణలపై ఆరాతీశారు. అదే విధంగా పాఠశాలలో భోజనం సక్రమంగా ఉండటం లేదన్న ఆరోపణల నేపథ్యంలో వంటను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం కనిపిస్తుందని హాస్టల్ వార్డెన్ పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణానిధి, జయసింహనాయుడు, పాఠశాల ఛైర్మన్ శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్: వడదెబ్బ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని సుబ్బరాయున పల్లిలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగమల్లేశ్వరి, సిహెచ్ఓ నరేష్, సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రశేఖర్, సిబ్బంది సత్యమ్మ, రాజశేఖర్, ఆశా కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

పుట్టపర్తి రూరల్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

పెనుకొండ : చేనేత కార్మికులను ఆదుకోవాలని సోమందేపల్లి మండల నాయకులు రాజగోపాల్ కోరారు. ఈ మేరకు ఆయనతో కలిసి చేనేత కార్మిక సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టం కచ్చితంగా అమలు జరపాలని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు చాంద్ బాషా, గంగరాజు, శ్రీకాంత్, చంద్రశేఖర్, వృత్తిదారుల కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు బాలస్వామి, చేనేత కార్మికులు ఈడిగ నాగరాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జితో ఇక్కట్లు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

నంబులపూలకుంట మండలంలో ఇన్‌ఛార్జి అధికారితో ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ మండల అధికారిగా గాండ్లపెంట అధికారిని ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. అయితే ఆయన మండల రైతులకు అందుబాటులో ఉండటం లేదు. కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వ సమావేశానికి సైతం హాజరు కావటం లేదు. మండలంలోని వివిధ గ్రామాల చెరువుల మరమ్మతుల విషయంలో కొంతమంది రైతులు స్పందన కార్యక్రమానికి అర్జీలతో వచ్చి అధికారి లేకపోవటంతో నిరాశగా వెనుతిరిగి వెళ్లారు. మండల పరిధిలో పెద్ద చిన్న చెరువులు దాదాపు 82 వరకు ఉన్నాయి. అన్ని చెరువుల వద్ద ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి ఈ ఉపాధి హామీ పనులను ఇరిగేషన్ అధికారి తనిఖీ చేసి గతంలో వర్షాలకి ఏ చెరువు ఎక్కడ ప్రమాద స్థితిలో ఉందో తెలుసుకుని ఉపాధి పథకం ద్వారా వాటి పనులు చేయించాల్సుంది. అయితే ఆయన మండలానికి రాకపోవటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. అంతేకాక మండల పరిధిలోని చెరువులు అక్రమానికి గురైనట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ అధికారి చెరువుల హద్దులు ఏర్పాటు చేయించాల్సుండగా ఆ పనికూడా చేయడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి మండల ఇరిగేషన్ అధికారిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలి

సోమందేపల్లి : మండల కేంద్రంలోని నక్కలగుట్ట ప్రాంతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలలో అధికారులు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పేదల ఇంటి నిర్మాణాలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని హైకోర్టు ఆదేశాలను కూడా అధికారులు ధిక్కరించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదని బోర్డు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు పాటించి వెంటనే బోర్డ్ తొలగించి పేదల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ ఇళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు హనుమయ్య, రంగప్ప , వెంకటేశులు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, నాగభూషణ, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, హుస్సేన్, ఉప్పర కిష్టప్ప, కురుబ కిష్టప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు రవితో పాటు ఇళ్లస్థలాల హక్కుదారులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, బాధితులు

మద్యం తరలింపు కేసులో ఇద్దరు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బోయవీధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బోయవీధికి చెందిన వెంకటేష్‌నాయక్, ముత్యాలు కలిసి మద్యాన్ని అక్రమంగా తరలించేవారు. ఈనేపథ్యంలో పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బంది రాజశేఖర్, మధుతో కలిసి బోయవీధిలో దాడి చేయడా తరలించేందుకు సంచిలో సిద్ధంగా ఉంచుకున్న 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. పట్టణంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, రవాణా చేసినా, గంజాయి అమ్మినా, మట్కా, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరుకు తోటకు నిప్పు

లేపాక్షి : మండలం పరిధిలోని ఓబులాపురం గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో చెరుకుపంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు వేణుగోపాల్‌రెడ్డి తన ఐదు ఎకరాల పొలంలో చెరుకుపంటను సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. చెరుకు ద్వారా ప్రస్తుతం బెల్లం తయారు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం చెరుకుపంటకు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో తనకు రూ. 25 లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి తనకు ఆదుకోవాలని కోరాడు.



అగ్నికి ఆహుతవుతున్న చెరుకుతోట

కళాశాల ఘటనపై బాధితులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పరిగి

ఇటీవలే పరిగి మండలం కొడిగినహళ్లి ఏపీఆర్జేసీ కళాశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు కుల వివక్షత కారణంగా దూషించారనిఈ సంఘటనపై అధికారులు బాధితులకు న్యాయం చేయకపోగా దళితులపై దుర్భాషలాడినఉపాధ్యాయురాలు సుజాత, శివారెడ్డి, చెన్నకేశవులుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కెవిపిఎస్, ఎంఎస్ఎఫ్ దళిత సమైక్య నాయకులు ఆగ్రహ వ్యక్తం చేశారు. సంఘటన జరిగి వారాలు గడుస్తున్న సంబంధిత అధికారులు కనీసం ఉపాధ్యాయురాలిపై కానీ అక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ క్లర్క్‌పై కనీస చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వ్యక్తులను వదిలేస్తే విద్యా వ్యవస్థ తప్పుదారి పట్టించే అవకాశం ఉందని వారు అన్నారు. ఈ ముగ్గురిపై కేసులు నమోదు చేసే ఇటు విద్యార్థులకు ఆటో దళిత ఉపాధ్యాయులకు తప్పక న్యాయం చేయాలని తహశీల్దార్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘాల వారిగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చెపడతామని హెచ్చరించారు. కొంతమంది బయట వ్యక్తులు సైతం దళిత ఉపాధ్యాయులపై ఫోన్ ద్వారా బెదిరింపు కాల్స్ చేస్తున్నట్లు వారు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎంఎస్ఎఫ్ రవికుమార్, దళిత సమైక్య జిల్లా కార్యదర్శి నారాయణ, ఎమ్మార్పీఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిద్దాం

ప్రజాశక్తి -పెనుకొండ

పిడిఎఫ్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలు, అనేక సామాజిక రాజకీయ హక్కుల కోసం ఉద్యమాల్లో పాల్గొన్న పోతుల నాగరాజుకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు మండల నాయకులు తిప్పన్న, వజ్రం నాగప్ప, రెడ్డప్పరెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైసిపి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు లోకేష్‌కు సూచించారు. లోకేష్‌ను ఇటీవల జిల్లా అధ్యక్షులుగా నియమించడంతో ఆయన సోమవారం అనంతపురంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా యువతను ఐక్యం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై యువజన సదస్సులు నిర్వహించి, వారందరికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ మనోజ్ కుమార్ గౌడ్, అమర్నాథ్ రెడ్డి, సాయికిరణ్, షేక్షవలి, శివసాయి, వంశీ, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరం

పజాశక్తి-హిందూపురం

ఆత్మరక్షణ విద్య అందరికి అవసరమని ఎల్ఆర్‌జి ప్రిన్సిపల్ ప్రసాద్ పేర్కొన్నారు. హిందూపురం రూరల్ మండలం ఎల్ఆర్‌జి పాఠశాలలో కరాటే మాస్టార్ రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో 130 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభా ఆధారంగా విద్యార్థులకు వివిధ బెల్టులు బహుకరించారు. ఈ సందర్భంగా ప్రసాద్, ఎఒ సంజీవరెడ్డి మాట్లాడుతు ప్రతి విద్యార్థికి ఆత్మరక్షణ విద్య అవసరమన్నారు. ముఖ్యంగా బాలికలకు ఈ విద్య ఎంతోగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి : సిపిఎం

లేపాక్షి : మండలంలోని కల్లూరు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నాయకులు ప్రవీణ్ కుమార్, హిందూపురం పట్టణ కమిటీ నాయకులు నరసింహప్ప, రామకృష్ణ, అత్తర్ బాబా, కెవిపిఎస్ మంజునాథ్ ఆటో నాయకులు రఫీ , రాజప్ప వెళ్లి సచివాలయం దగ్గర తమ నిరసన తెలిపారు. తాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం : పల్లె

పుట్టపర్తి రూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తి తహశీల్దార్‌కార్యాలయం వద్ద పలు ఫిర్యాదులతో అధికారుల కోసం వేచి ఉన్న వారిని పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పనుల కోసం వచ్చే ఫిర్యాదుదారులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్యకు పై కూడా పలుమార్లు కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం భావ్యం కాదని అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ విజయ్ కుమార్, పుల్లప్ప, అంబులెన్స్ రమేష్, ఓబులేసు, బొమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపం అద్భుత ప్రయోగాలు




వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్



నమూనాను తిలకిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపమే వారు చేసినా అద్భుత ప్రయోగాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. సోమవారం పట్టణంలోని అల్ ఆమిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, ఎంఇఒ గంగప్ప, ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, జిల్లా నాయకులు వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను వారు తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు చిన్నారులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతాలు చేశారన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రయోగాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రీయాజ్, హెచ్‌ఎంతో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డివైడర్‌ను తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి -పెనుకొండ

సోమందేపల్లి మండలకేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న డివైడర్‌ను తొలగించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్అండ్‌బి డిఇ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డు విస్తరణ భాగంగా ఈ మధ్యకాలంలో రోడ్డు పనులు చేపట్టారని, ఇరువైపులా ఇళ్లు, షాపులు తొలగించి రోడ్డు వెడల్పు చేసి మధ్యలో డివైడర్ ఎక్కువ వెడల్పుతో నిర్మించారని చెపాపరు. దీంతో వాహనదారులకు, ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు. సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తామని ఆర్ అండ్‌బి డిఇ నాగరాజు ఫోన్లో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చాంద్ బాషా, గంగరాజు, శ్రీకాంత్, బాలస్వామి, చంద్రశేఖర్, చేనేత కార్మికులు, నాగరాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లను కించపరచొద్దు

ప్రజాశక్తి - బుక్కపట్నం

వడ్డెర్లు రాజకీయాలలో ఇప్పుడిప్పుడే ఎదుగుతుంటే వారిని చులకనగా మాట్లాడడం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి తగదని జిల్లా వడ్డెర్ల సంఘం నాయకులు, డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వడ్డెర్ల ఆత్మీయ సమావేశం పుట్టపర్తిలో నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా ఆ సంఘం నాయకులు, సామాజికవర్గం వారు పెద్ద స్థాయిలో హాజరై తమ కార్యచరణ గురించి చర్చించుకున్నామన్నారు. అయితే తమ సామాజికవర్గం వారు నిర్వహించిన సమావేశాన్ని జీర్ణించు కోలేక మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వడ్డెర్ల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించి నాయకులను చులకన చేసి మాట్లాడడం భావ్యం కాదని అన్నారు. ఒకరి దయా దాక్షిణ్యాలపై ఆధార పడాల్సిన అవసరం తమ సంఘానికి లేదని అవసరమైతే తామే పల్లె రఘునాథ్ రెడ్డికి సాయం చేస్తామని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా పల్లె రఘునాథ్ రెడ్డి నీచ రాజకీయాలు మానుకొని బీసీల పట్ల గౌరవంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామసాగరం ఆది , కొత్తచెరువు పెద్దన్న పాల్గొన్నారు.



అధికారికి సమస్యను వివరిస్తున్న నాయకులు


ఫేస్‌యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

పెనుకొండ : గ్రామ రెవెన్యూ సహాయకులకు ఫేస్‌యాప్ మినహాయింపు ఇవ్వాలని సిఐటియు నాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ స్వర్ణలతకు సోమవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేస్ యాప్ విధానాన్ని తీసుకురావటంతో గ్రామ రెవెన్యూ సహాయకులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రతిరోజు తహశీల్దార్ కార్యాలయానికి రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని అనానరు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, మూర్తి, ముత్యాలు, విఆర్ఎల సంఘం నాయకులు నరసప్ప ,ఆంజనేయులు, పుల్లన్న ,గంగాధర్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎగువభద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారే : కాంగ్రెస్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కర్నాటక ప్రభుత్వం తుంగభద్ర నది మీద ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణం లోని కోటా లాడ్జిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర రాయలసీమకు జీవనాడి అని అన్నారు. నదిలో 416 టీఎంసీల నీరు ఏడాదికి నికర జలాలు ఉన్నాయని ఈ మేరకు బచావత్ ట్రిబునల్ అవార్డు ప్రకటించిందని అన్నారు. ఇందులో 290 టీఎంసీలు కర్నాటకకు, 126 టీఎంసీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిందన్నారు. అయితే కర్నాటకకు కేటాయించిన నీటిని ఆరాష్ట్రం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటుందన్నారు. ఇప్పుడు కర్నాటక ప్రభుత్వం ఎగువ భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి ప్రభుత్వం బడ్జెట్ లో రూ. 5300 కోట్లు కేటాయించిందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం మోడీ ప్రభుత్వం రాయలసీమకు ద్రోహం చేయాలని చూస్తుంటే ఏపీ ముఖ్యమంత్రి జగన్ నోరు ఎత్తకపోవడం శోచనీయమని అన్నారు. ఈ సమావేశంలో ఎఐసిసి సభ్యులు కోటా సత్యం, కడప నాయకులు రామకృష్ణ, ఉత్తన్న, ఆమీర్, వెంకటేష్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉద్రిక్తతకు పోలీస్ అధికారే కారణం : కందికుంట

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గ కేంద్రంలో కొన్ని కారణాలవల్ల ఉద్రిక్తత పరిస్థితులు రావడానికి కారణం పోలీస్ అధికారి మితిమీరిన తనమేనని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. 21 కేసుల్లో ముద్దాయిగా కొనసాగుతున్న ఆ నాయకుడికి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. పోలీస్ అధికారి మితిమీరిన అధికార మదంతో వ్యవహరించడం వల్లే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. ప్రజలకు సమస్యలు వస్తే ఎందాకైనా వెళతామన్నారు. పోలీస్ ఉన్నత స్థాయి అధికారి ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడిన మాటలపై తమకు నమ్మకం కలిగిందన్నారు. మహిళలను కించపరచడం, లాఠీఛార్జి చేయడం బాధ్యతారహితంగా పవర్తించడం లాంటి వాటికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని చెప్పడం పట్ల పోలీసు వ్యవస్థపై నమ్మకం,గౌరవం మరింత పెరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 'కందికుంట'

పరామర్శించిన అత్తార్ : కదిరి పట్టణంలో జరిగిన సంఘటన చూసి సిఎం జగన్మోహన్‌రెడ్డి సిగ్గుపడాలని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అత్తార్ చాంద్ బాషా విమర్శించారు. ఇటీవల పట్టణంలో జరిగిన సంఘటనలో గాయపడిన టిడిపి నాయకురాలు పర్వీన్ భానును పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై దాడులు నివారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

IN THE COURCT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDE:HINDUPURAM
O.S. 247/2022

Between:
P.Chandra Sekhar ...**Plaintiff**
And
1.Bestha Adinarayanappa,
2.Bestha Suresh ... **Defendants**
To

Notice To The DEFENDANTS No 1 AND 2

1.Bestha Adinarayanappa S/o B.Venkataramappa, Aged about 66 years, Agriculturist,
2.Bestha Suresh S/o B.Adinarayanappa, Aged about 38 years, Agriculturist,
Both are residing at Muddappalli Village, Koduru Post, Chilamathur Mandal, Sri Sathya Sai Dist.

The plaintiff filed the above suit against you No.1 and 2 for specific performance on the file of Hon'ble Principal Junior civil judge court, Hindupuram and the same is posted to 23-3-2023 for your appearance in person or through an advocate, If you failed to appear on that day you will be set ex-parte and the matter will be decided in your absence.

(By the order of court)
C,NAGARAJU, S.R. ANJANEYULU
ADVOCATES FOR PETITIONER-PLAINTIFF HINDUPUR.